# ఆధునికం

"నన్ను చూడటానికి ఎవరైనా వస్తే వళ్ళు రాలగొడ్తాను" రుసరుస లాడ్తూ లోపలకు వచ్చింది – శారద.

హాల్లో కూర్చుని పేపరుచూస్తున్న ప్రభాకర్ తలెత్తి, పేపరు మడుస్తూ, "నిన్నిప్పుడు చూడటానికి ఎవరు వస్తున్నారమ్మా, శారదా!" విస్మయంగా అడిగాడు.

"ఏం జరిగిం దేమిటి?" నవ్వుతూ వచ్చిన లలిత అడిగింది, శారదను.

ప్రభాకర్ ప్రశ్నార్థకంగా చూశాడు భార్యకేసి. "ఏమయిం దసలు?"

"జయను చూసుకోటానికి వచ్చారట. అక్కడకు వెళ్ళింది."

"ఓ హెూ! అదా సంగతి!" అంటూ నవ్వేశాడు ప్రభాకర్.

"ఊс! మీకు నవ్వులాటగానే ఉంటుంది! సంతలో పశువును పరీక్షించినట్లే! ఎంత వరకు చదివావు? ఈ పుస్తకం చదువు. వంట వచ్చా? లేచి నడిచి చూపించు? పాటలు వచ్చునా? ఇంకా ... ఇంకా... ఛీ...ఛీ! బుద్ధుండదు. అంత చదువులు చదివినా, ఎదుటి మనస్సు బాధ పడ్తుందేమోనన్న జ్ఞానం ఉండదు! ఆ మహానుభావుడు నల్లగా ఉన్నా, అంద వికారంగా ఉన్నా, రాబోయే పెళ్ళాం మాత్రం అపర రంభలా ఉండాలి!..."

"ఇంతకూ నిన్ను చూడటానికి ఎవరూ రాలేదు కదా? ఎందుకీ కోపం?"

"అసలు నేను పెళ్ళే చేసుకోను."

మృదువుగా నవ్వి చెల్లెలువైపు ఆప్యాయంగా చూశాడు ప్రభాకర్.

• • •

మర్నాడు వీధి గుమ్మంలో ముగ్గు పెడుతోంది శారద.

---

*ప్రథమ బహుమతి రూ. 50*

డి. ఎస్. వి. సత్యనారాయణ మూర్తి
ఆంధ్ర వెటరినరీ కాలేజి,
తిరుపతి



'ప్రభాకర్ ఇల్లు ఇదేనాండి?'

శారద గిర్రున తిరిగి చూసింది. చేతిలో లెదరు కేసుతో సత్యనాథ్ నిల్చున్నాడు.

'రండి. లోపల ఉన్నాడు.' సోఫాలో కూర్చోబెట్టి లోపలకు వెళ్ళి ప్రభాకర్‌ను పిల్చింది.

'ఎవరు? శారదా?' అంటూ వచ్చిన ప్రభాకర్, సత్యనాథ్‌ను చూసి—'నీవట్రా? ఎవరో అనుకున్నాను' కౌగలించుకున్నంత పని చేశాడు.

'కాఫీ అన్నయ్యా!' ట్రే, టీపాయ్‌మీద వుంచి, అంది శారద.

'మా సిస్టర్ శారద. పి. యు. సి.' అని 'శారదా! వెటరినరి డాక్టర్ సత్యనాథ్ అని చెప్పేవాడిని కదూ? వీడే.'

నమస్కారాలయ్యాక, 'ముక్కు మీద కోపం ఉంటుందనే వాడివి ఈ శారదగారికేనా?' నవ్వుతూ అడిగాడు సత్యనాథ్.

'అవును' శారదను చూస్తూ నవ్వాడు.

శారద కోపంగా చూసింది. 'వదినను పిలు శారదా!' మాటలోనే వచ్చింది లలిత.

'నమస్తే సత్యనాథ్‌గారూ!'

'నమస్తే!'

'ఉత్తరం వ్రాస్తే, స్టేషన్‌కు వచ్చేవాడిని కదా?'

'ముందు అనుకో లేదసలు. ఇక్కడ స్టేషన్లో ట్రెయిన్ ఆగిన తర్వాత నువ్వు గుర్తువచ్చి, చూసి వెళ్దామని దిగాను. సాయంకాలం బండికి వెళ్తాను.'

'నో, నో, రేపు ఆదివారం. సరదాగా ఉంటుంది. మరో రెండు రోజులుండి వెళ్ళవచ్చు.'

'సెలవు లేదురా!' ఆదివారం ఉండి సోమవారం వెళ్ళేలా ఒప్పుకున్నాడు.

సాయంకాలం కాలేజీ నుండి, శారద వచ్చేటప్పటికి, కాంపౌండులో పూల మొక్కలమధ్య కుర్చీలు వేసుకుని కూర్చున్నారు.

'గుడ్ ఈవినింగ్ శారదాదేవి గారూ!' గుడ్ ఈవినింగ్ అంటూ లోపలకు వెళ్ళి పుస్తకాలు ఉంచి, వచ్చి వాళ్ళ దగ్గర కూర్చుంది.

'శ్రద్ధగా చదవండి శారదగారూ! క్లాసువస్తే మెడిసిన్‌కు వెళ్ళవచ్చు.'

'ఆఁ! ఏదో ఓపిక ఉన్నంతవరకూ చదువుతున్నాలెండి' అంది నవ్వుతూ.

'పట్టుదలతో చదివితే, రాక ఏమి చేస్తుంది.'

'థాంక్స్.'

'శారదా! నీళ్ళు పొయ్యలేదని, మా 'శకుంతల ఎక్కడకు వెళ్ళింది?'

అని గోల పెడుతున్నాయి. వెళ్ళి పలకరించు పూలమొక్కల్ని" నవ్వుతూ అంది లలిత.

"ఏమిటి ఇవన్నీ ~~లలిత~~శారదగారు పెంచినవే ?!"

"అవును."

"అంతేకాదు. మా శారద వీణ వాయిస్తుంది. నిజంగా ఆ శారదే ప్రత్యక్షమై నట్లుంటుంది." ప్రభాకర్ అన్నాడు. శారద మాట్లాడలేదు. "నిజం ?" అని అడిగాడు. "కరక్ట్" అంది లలిత. వదినవేపు కోపంగా చూసింది. "ఒక్కసారి మా వీనుల విందు చేయగలరా, శారదగారూ?" తలెత్తి సత్యనాథ్‌ను చూసి, లోపలకువెళ్ళి వీణ తెచ్చి రెండు పాటలు పాడింది.

"ప్రభాకర్ అన్నదాంట్లో అతిశయోక్తి లేదు" అని మెచ్చుకున్నాడు సత్యనాథ్.

"థాంక్స్" అంది తల దించుకుని.

భోజనం చేస్తూ, "వంట ఎవరు చేశారండి ?" అని అడిగాడు సత్యనాథ్.

"ఏం బుద్ధి పుట్టిందో వంట తనే చేసిందివాళ" లలిత నవ్వుతూ అంది.

శారద అతృతగా చూసింది. "నమ్మలేక పోతున్నాను" అన్నాడు సత్యనాథ్.

"హొటల్ నుండి తెప్పించామనుకోండిపోనీ" చిన్నగా నవ్వుతూ అంది శారద.

"శారదా దేవికి చేతకాని పనంటూ లేదనుకుంటాను రా ప్రభాకర్ !"

"మగ పురుగులంటే పడదు."

"ఓ ! ఐ. సీ."

• • •

ట్రెయిన్ కదిలింది. "ప్రభాకర్! లలితగారూ! శారదాదేవీ!" చేయి ఊపాడు సత్యనాథ్ వెళ్తున్న ట్రెయిన్‌లోనుండి. ప్లాట్‌ఫారమ్ వదిలింది ట్రెయిన్.

"శారదా! పళ్ళు రాలగొట్టలేదేం ?" నవ్వు నాపుకుంటూ, అడిగింది లలిత.

"ఎవర్ని ?" పరధ్యానంగా అంది శారద. "నిన్ను చూడటానికి వస్తే పళ్ళు రాలగొడతా నన్నావుకదూ ?"

"ఎవరు ? ఆయన...సత్యనాథ్..."

"మీ ఆయనే!" నవ్వేసింది లలిత.

"అవునా అన్నయ్యా !" కోపంగా చూసింది ప్రభాకర్‌ను. ప్రభాకర్ చిన్నగా నవ్వాడు.

మీకు నవ్వులాటగానే ఉంటుంది, అని శారద, అనలేదు!

□□□